మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

అంతర్ రాష్ట్ర వంతెన నిర్మాణానికి సహకరించాలి

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ మల్లు రవికి వినతి పత్రం : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, జూలై 25 ప్రభాతవార్త:తెలుగు రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి మరియు ఉమ మహేశ్వర స్వామి దేవస్థాన ఆవరణలో రూప్‌వే నిర్మాణానికి పార్లమెంట్‌లో తమ తరుపున మాట్లాడి నిర్మాణాలకు సహకరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఎంపీ మల్లురవిని కలిసి కోరారు. న్యూఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో కాంగ్రెస్ ఓబీసీ నాయకత్వం భగేదారీ న్యాయ సమ్మేళనం కార్యక్రమానికి తెలంగాణ తరపున హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఎంపీ మల్లురవిని మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. మద్దిమడుగు సమీపంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. నల్లమల లోని ప్రముఖ పుణ్యక్షేత్రం మద్దిమడుగుకు ఎపీ నుంచి భక్తులు ఎక్కువ మంది వస్తారని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం ద్వారా ఎపీ నుంచి రాయచూరు, కర్ణాటక ప్రాంతాలకు సుమారు వంద కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం ఎపీలోని మాచర్ల నుంచి అచ్చంపేటకు రావాలంటే 379 కిలోమీటర్లు అవుతుందని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే దాదాపు 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు.అలాగే జడ్చర్ల,అచ్చంపేట,మద్దిమడుగు మీదుగా మాచర్లవరకు రవాణాసౌలభ్యం కలుగుతుందని వివరించారు.ఉమమహేశ్వరస్వామి దేవస్థాన ఆవరణలో రూప్‌వేను నిర్మిస్తే నల్లమల ప్రాంతంలో మరొక టూరిజం స్పాట్‌గా ఉమమహేశ్వర దేవస్థానం ఉంటుందని తెలిపారు. మల్లురవి సానుకూలంగా స్పందించి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వానికి వివరిస్తామని చెప్పారన్నారనీ ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.

ఎంపీ మల్లురవితో ఎమ్మెల్యే వంశీకృష్ణ

స్థానిక సమరానికి సై

- జెడ్పీ, ఎంపిపి పదవుల్లో పట్టుకు ప్రయత్నాలు

- నెలాఖరుకు స్థానిక నోటిఫికేషన్ వెలువడే అవకాశం

భూత్పూర్,జూలై 25,ప్రభాతవార్త : రాష్ట్రంలో రెండేళ్ల తర్వాత ఎమ్మెల్యేలు,ఎంపీల ఎన్నికల అనంతరం తొలిసారిగా స్థానిక సంస్థల ఎన్ని కలు జరుగుతున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల హవా మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొనసాగించాలనే ధృడసం కల్పంతో ఉండగా,గత అసెంబ్లీఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్న బీఆర్ ఎస్ స్థానిక సంస్థల్లోనైన సాధ్యమైనన్ని సీట్లు గెలిచి, స్థానికాల్లో పట్టును సాధించి తమ ప్రాభవాన్ని చాటుకోవాలని తహతహలాడుతోంది. పాల మూరు ఉమ్మడి జిల్లాల్లో స్థానిక సమరానికి సంబంధిత జిల్లా అధికారు లు అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు.ఉమ్మడి ఐదుజిల్లాల్లో మొత్తం 800 ఎంపిటీసీ,77ఎంపిపి,జెడ్పీటీసీ,ఐదు జిల్లా పరిషత్ చైర్మన్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఇందులో మహ బూబ్‌నగర్,జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట,వనపర్తి జిల్లాల ఒక్కొక్కటి చొప్పున జిల్లా పరిషత్ చైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.ఇదేవిధంగా జోగులాంబ గద్వాలకు 13చొప్పున జెడ్పీటీసీ,ఎంపిపి స్థానాలు,142ఎంపిటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.ఇదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాకు 16జెడ్పీటీసీ, ఎంపిపి స్థానాలు,175ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. నాగర్‌కర్నూల్ జిల్లాకు 20చొప్పున జెడ్పీటీసీ,ఎంపిపి స్థానాలు,214 ఎంపిటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.ఇదేవిధంగా నారాయణపేట జిల్లాకు 13చొప్పున జెడ్పీటీసీ,ఎంపిపి స్థానాలు,136ఎంపిటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.వనపర్తి జిల్లాకు 15చొప్పున జెడ్పీటీసీ,ఎంపిపి స్థానాలు,133ఎంపిటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.భూత్పూర్ మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి,10ఎంపీటీసీ స్థానాలకు,ఓ జెడ్పీటీసీ స్థానానికి అధికార పార్టీ కాంగ్రెస్,ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల మధ్య గట్టి పోటీ ఉండగా, మూడో స్థానంలో బీజేపీ తన ప్రాభవాన్ని చాటుకునేందుకు ప్రయత్నిస్తోందనే చెప్పాలి.ఎంపిపి రేసులో కాంగ్రెస్ నుంచి హరియా నాయక్ (ఎస్టీ),రావులపల్లి మొల్గర నర్సింహులు(ఎస్సీ)ఇక ఎంపిటీసీ పదవుల రేసులో మందడి నర్సింహ్మారెడ్డి,మాజీ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి,రేకుల పాటి భూపతిరెడ్డి,రవీందర్‌రెడ్డి,రాజు,మర్చేందర్,ఎర్రవాపు నర్సింహులు,తమన్నగౌడ్,రాంరెడ్డి,వెంకటేష్, తదితరులు ఎంపిపి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.జెడ్పీటీసీరేసులో కాంగ్రెస్ నుంచి ఒకేఒక్కరు మండల కాంగ్రెస్అధ్యక్షుడు చైర్మన్ అభ్యర్థిగా కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.ఇందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.ఇక ఎంపిపి స్థానానికి ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ నుంచి రమేష్ చందర్,అంజనేయులు నాయక్(ఎస్టీ),ఆల శ్రీకాంత్‌రెడ్డి(ఓసీ), మేకల, మనెమోని(బీసీ)లు ప్రధానంగా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఎంపిటీసీలకు పదిమంది ఆశావహులున్నారు.ఇక జెడ్పీటీసీ -మిగతా3లో..

గ్రామీణ విద్యలో

కొత్త శకం

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్

- విద్యాశాఖపై జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవ
- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ (ఎఐ) తరగతులు

విద్యార్థుల ఏఐ క్లాసులను పరిశీలిస్తున్న కలెక్టర్

వనపర్తి,జూలై 25 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ధృష్టి సారించడంతో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సైతం విద్యాశాఖపై ప్రత్యేక ధృష్టిని పెడుతున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే అయా సబ్జెక్టులపై పట్టు సాధించి భయం వదిలేస్తే ఇక జీవితంలో వెనుకంజ వేయరనే విషయాన్ని గ్రహించి ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే విద్యా సామర్థ్యాలు పెంచేందుకు సబ్జెక్టుపై అవగాహన పెంచి భయాన్ని పోగొట్టేందుకు ఆధునిక పద్ధతుల్లో డిజిటల్ విద్యను బోధిస్తున్నారు. దీనికితోడు ప్రస్తుతం తెలంగాణాలోని ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య పెన్ పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్‌ను కేటాయించడం గమనార్హం. ముందుగా పాఠశాలలో 3వ తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులలో ఎవరైతే విద్యలో వెనుకబడి ఉన్నారో అలాంటివారిని గుర్తించి వారికి కంప్యుటర్ ద్వారా ఆర్టిఫిషియల్ (ఎఐ) విద్యను అందిస్తున్నారు. ఇందులో భాషా సబ్జెక్టులతో పాటు లెక్కల సబ్జెక్టు బోధించడం జరుగుతుంది. కంప్యూటర్ ముందు కూర్చునే విద్యార్థి ఏ విద్యార్థికి ఆ విద్యార్థి తన పెన్ నెంబరుతో లాగిన్ అయి సబ్జెక్టు ఎంపిక చేసుకుంటే కంపూటర్ విద్యా బోధనా ప్రారంభిస్తుంది. ముందుగ కంప్యూటర్ ఒక ప్రశ్నను సందిస్తుంది అది విద్యార్థి పరిష్కరిస్తే ముందుకు వెళ్లి మరో ప్రశ్నను సందిస్తుంది. ఒకవేళ ప్రశ్నకు సమాధానం తప్పు చెప్పిన, లేదా విద్యార్థి చేయలేకపోయినా కంప్యూటర్ విద్యార్థికి అర్థమయ్యే విధంగా ఇంకా చిన్న ప్రశ్న సందిస్తుంది విద్యార్థికి సులువుగా అర్థమయ్యే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. విద్యార్థి ఎంతవరకు నేర్చుకున్నాడో ఆటోమేటిక్‌గా తదుపరి క్లాస్‌కు నిక్షిప్తం చేసుకుంటుంది. తదుపరి క్లాస్‌లో అక్కడి నుండి ప్రారంభిస్తుంది. దీనిద్వారా విద్యార్థికి సులువుగా అర్థం కావడమే కాకుండా విద్య పట్ల కంప్యూటర్ పరిజ్ఞానం పట్ల మంచి పట్టు సాధిస్తారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చొరవతో వనపర్తి జిల్లాలోని ప్రాథమిక ఉన్నత పాటశాలలు, ప్రాథమిక పాఠశాలలు ఒకే చోట ఉన్న 23 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక మోలిక సదుపాయాలతో కంప్యూటర్ ఆధారిత తరగతులను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మూడో తరగతి నుంచి 5 తరగతి వరకు చదువుతున్న 471 మంది విద్యార్థులు ఆర్టిఫిషియల్ విద్యను రోజుకు 30 నిమిషాల పాటు ప్రత్యేక తరగతి ద్వారా నేర్చుకుంటున్నారు. దీనివల్ల విద్యార్థులు తక్కువ సమయంలోనే పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నారు. వారు క్లాస్‌రూమ్‌లో మనోధైర్యంతో పాల్గొంటున్నారు. ముఖ్యంగా తనపట్ల తనకు నమ్మకాన్ని పెంపొందించుకొని చదువు పట్ల భయాన్ని దూరం చేసుకుంటున్నారు. ఈ వినూత్న కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వానికి విద్యా రంగంపై ఉన్న నిబద్ధతకు, ప్రత్యేక దృష్టికి ఉదాహరణగా నిలుస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాల అమలులో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విశేష పాత్ర పోషిస్తున్నారు. విద్యారంగానికి - మిగతా4లో..

ప్రాజెక్టులకు జలకళ

- జూరాలకు 80వేల క్యూసెక్కుల వరద
- 12 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- 202టీఎంసీలకు చేరిన శ్రీశైలం డ్యాం

శ్రీశైల నుంచి విడుదలవుతున్న వరద

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 25, ప్రభాతవార్త : శ్రీశైలం జలాశయానికి వరద పెరుగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 34,225క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 48504 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 35,296 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 99,122క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. రెండు గేట్లు 10అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.50అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 202.0439 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66331 క్యూసె క్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

జూరాల 12గేట్ల ద్వారా నీటి విడుదల

జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 80,000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.708టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 34,227క్యూసెక్కులు, స్పిల్ వేద్వారా 48,504 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్ట-2కు 750 క్యూసెక్కులు,కోయిల్ సాగర్‌లిఫ్ట్‌కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు750,ఆర్డీఎస్ కెనాల్‌కు 150క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1250 క్యూసెక్కులు, కుడి కాలువకు 645 క్యూసె క్కులు,సమాంతర కాలువకు 200క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 85,391క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

సీఎంకు వెన్నుదన్నుగా

నిలబడుదాం..

- కార్పొరేషన్‌పై జెండా ఎగరేద్దాం..
- కాంగ్రెస్ పార్టీ తోనే సామాజిక న్యాయం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన 500మంది బిజెపి, బిఆర్ఎస్ నాయకులు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై25, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీలో చేరికష్టపడే వారికి కాంగ్రెస్ పార్టీలో తప్పక సముచిత స్థానం ఉంటుందని, కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ జిల్లా రైతు బంధు అధ్యక్షులు గోపాల్‌యాదవ్, మహబూబ్‌నగర్ మాజీమున్సిపల్ కౌన్సిలర్లు పద్మజ గోపాల్‌యాదవ్,రామకృష్ణ మరియు 14వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుర్వ సత్యం ఆధ్వర్యంలో భారీగా నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ - మిగతా4లో..

పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు

- వార్డులో పర్యటిస్తూ.. సమస్యలు ఆరా తీస్తూ..
- సూచనలు చేస్తూ.. ఆదేశాలిస్తూ..
- జడ్చర్లలో కలెక్టర్ విజయేంద్ర బోయి పర్యటన
- ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశం

దవాఖానలో వసతులపై ఆరా తీస్తున్న కలెక్టర్

మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

జడ్చర్ల, జూలై25, ప్రభాతవార్త : కలెక్టర్ విజయేంద్ర బోయి స్వయంగా రంగంలోకి దిగారు. జడ్చర్ల మున్సిపాలిటీలో 3డెంగీ కేసుల నమోదుకావడంపై స్వయంగా వార్డుల్లో పర్యటించారు. ఆదనపు కలెక్టర్ శింవేంద్ర ప్రతాప్, జడ్చర్ల కమిషనర్ లక్ష్మారెడ్డి,చైర్‌పర్సన్ పుష్పలతతోపాటు ఏఈ,డీఈలతో కలిసి వార్డుల్లో సమస్యలు తెలుసుకున్నారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.శుక్రవారం డ్రై డే సందర్భంగా జడ్చర్ల పట్టణంలో 3వ వార్డ్ గౌరీ శంకర్ కాలనీ,14 వ వార్డ్ నాగర్ కర్నూల్ రోడ్డు,,6 వ వార్డులలో పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, కూలర్ లలో నీరు నిలవ వుండకుండా తొలగించాలన్నారు.స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఖాళీ ప్లాట్‌లలో చెత్త చెదారం లేకుండా సంబంధిత ప్లాట్ యజమానికి నోటీస్ జారీ చేయాలన్నారు. నాగర్ కర్నూల్ రోడ్డు 14 వ వార్డ్ లో షాపుల ముందు వర్షా కాలంలో వరద నీరు రోడ్డు పైకి వస్తున్నట్లు కాలనీ వాసులు తెలుపగా వరద నీరు నిలిచి రోడ్డు పైకి రాకుండా డ్రెయినేజీ ద్వారా వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. ఆరో వార్డ్ కు వెళ్లి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. నల్లకుంట వద్ద వరద ఎక్కువ వచ్చినప్పుడు ఇబ్బందులపై ఏఈ గాయత్రి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జడ్చర్ల లో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి(ఏరియా ఆసుపత్రి) ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రి పక్కన నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ సెంటర్ ను పరిశీలించి నిర్మాణ ప్రగతిని తెలుసుకున్నారు. పాత ఆసుపత్రి నుండి మార్చుర్రీ ని కొత్త ఆసుపత్రి కి షిఫ్ట్ చేయాలని ఆదేశించారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ను తనిఖీ చేసిన కలెక్టర్ జడ్చర్ల మండలం బాదేపల్లి గ్రామంలో అగ్రోస్ రైతు సేవా కేంద్రం2 గోదాంను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం2 లో 275 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, ప్రతిరోజు స్టాక్ వస్తూ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ లక్ష్మా రెడ్డి,ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్ర కళ, మిషన్ భగీరథ ఏఈ వ్యవసాయ అధికారులు ఉన్నారు.

మహిళాభ్యుదయానికి

పెద్దపీట : ఎమ్మెల్యే

విద్యార్థినులకు బహుమతులు ప్రధానం చేస్తున్న ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 25 ప్రభాతవార్త:రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మహిళాభ్యుదయానికి పెద్దపీట వేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహలక్ష్మి విజయవంతం సదస్సుకు డిఎం యాదయ్య అధ్యక్షత వహించగా పలువురు మహిళలు విద్యార్థులు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారో వివరించారు. పలు పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పెయింటింగ్ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బాధ్యతలు - మిగతా4లో..

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి


లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గద్వాల టౌన్ జూలై 25, ప్రభాతవార్త: మహిళల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు.శుక్రవారం ధరూర్ మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి,రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక,సామాజిక, సాధికారతకే ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా వడ్డీ లేని రుణాల పంపిణీ జరుగుతుందని చెప్పారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందని అన్నారు.మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ప్రమాద భీమా,రుణ భీమా కల్పనతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, పాఠశాల నిర్వహణ, క్యాంటీన్లు,పెట్రోల్ బంకుల నిర్వహణ, స్కూల్ యూనిఫామ్‌ల తయారీ,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పనులు మహిళలకే అప్పగిస్తూ,వారికి ఉపాధిని కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు అందరూ తమలోని శక్తి,నైపుణ్యాలను, కళలను, సృజనాత్మకతను వెలికి తీసి అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.రేషన్ కార్డుల ద్వారా ఉచిత సన్నబియ్యం పంపిణీతో పాటు, సంక్షేమ ఫలాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధరూర్ మండలం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, వ్యవసాయానికి నీటి కాలువలు, త్రాగునీటి సదుపాయాలు,రోడ్లు, విద్యాభివృద్ధిపై కృషి జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ధరూర్ మండలంలో 632 మహిళా సంఘాల్లో 7000 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని,ఇంకా అనేక మంది మహిళలు సంఘాల్లో సభ్యులుగా చేరాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు,ఉపాధి అవకాశాలు,వడ్ల కొనుగోలు, యూనిఫామ్ స్టిచింగ్ వంటి పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు కూడా ఈ మండలానికి 800 మంది అరులైన వారికి మంజూరు చేసినట్లు తెలిపారు.లబ్ధిదారులు త్వరగా పనులను ప్రారంభించి నిర్మాణం చేసుకోవాలని అన్నారు. రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం ప్రభుత్వం కొత్తగా ధరూర్ మండలానికి 600 పైగా రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.రేషన్ కార్డు దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి పరిష్కారం కల్పించబడుతోందని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలనలో తీసుకున్న ప్రతి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ,ఇందిరమ్మ ఇల్లు,రైతు భరోసా,ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు పెట్రోల్ బంకులు,సోలార్ ప్లాంట్లు వంటి - మిగతా4లో..

ప్రజల మన్ననలు పొందేలా

విధులు నిర్వర్తించాలి

నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

నారాయణపేట ప్రతినిధి, జూలై 25 ప్రభాతవార్త : వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం మరికల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం పోలీస్ అధికారులు సిబ్బందియొక్క కిట్‌ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు.గవర్నమెంట్ - మిగతా4లో..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చిన్న చింతకుంట, జూలై 25 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శిరీష సూచించారు.శుక్రవారం డ్రైడేసందర్భంగా ఆయా గ్రామాలలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు కాలనీలలో పర్యటించి నీటి నిల్వ ఉన్న వాటిని తొలగించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తమ ఇంటి పరిసరాలలో నీటి నిల్వ ఉంచుకోరాదని, పిచ్చి మొక్కలు ఉంటే తొలగించుకోవాలని సూచించారు. టైర్లు, గుంతల్లో నీటి నిలువ కారణంగా దోమలు ఉత్పన్నమై మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల బారిన పడతారని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి గుంతల్లో దోమ గుడ్లను చంపే ద్రావణాన్ని చల్లారు. కలుషితమైన నీటిని తాగకుండా ఎప్పటికప్పుడు వేడి చేసి చల్లార్చి తాగాలని, వేడి వేడి పదార్థాలను భుజించాలని వైద్యురాలు శిరీష సూచించారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు.

నీటి గుంతల్లో ద్రావణాన్ని చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

ఆత్మకూరులో వీరారెడ్డి జయంతి వేడుకలు

ఆత్మకూర్ జూలై 25,ప్రభాతవార్త: అమరచింత మాజీ ఎమ్మెల్యే ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ స్వర్గీయ వీరారెడ్డి జయంతి వేడుకలను మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం రోజు ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వీరారెడ్డి చేసిన సేవలను కొనియాడారు అమరచింత నియోజకవర్గంలో పేదల అభ్యున్నతికి తోడ్పాటు అందించిన ఏకైక వ్యక్తి వీరారెడ్డి అని ఆయన కొనియాడారు ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ విప్పుగా రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలను ఆయన కొనియాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా వెలుగుందిన వీరారెడ్డి ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృత నిశ్చయంతో పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వీరారెడ్డి జయంతిని పురస్కరించుకొని రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు వినయ్ కుమార్ రెడ్డి గణేష్ ముదిరాజ్ శ్రీనివాసులు నర్సింలు తదితరులతోపాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజెపి రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య పరీక్షలు

ఉప్పునుంతల,జూలై25 ప్రభాతవార్త: మండలంలోని వెల్టూరు మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం వైద్యాధికారిణి డా. స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థిని లకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారిణి డాక్టర్ స్వప్న మాట్లాడుతూ విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసర ప్రాంతాల పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందించారు. వానాకాలం ఎక్కువగా దోమల నుంచి డెంగీ, మలేరియా, మెదడు వాపు లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందుకు గాను ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ వైద్య పరీక్షలో వైద్యాధికారిణి డా. స్వప్నతో పాటు సూపర్‌వైజర్ ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్ జగదీష్, ఎంఎల్‌హెచ్‌పి నవ్య, ఏఎన్ఎం జ్యోతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భూత్పూర్‌లో ఎమ్మెల్యేచే రేషన్‌కార్డుల పంపిణీ

భూత్పూర్,జూలై 25,ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రజాపాలనలో రేషన్‌కార్డులు లేని నిరుపేదల నుంచి అభ్యర్థనల్ని స్వీకరించి వాటిలో అర్హులైన వారికి రేషన్‌కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది.ఇందులో భాగంగానే శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కేవీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం పదిన్నర గంటలకు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని భూత్పూర్ మండల రెవెన్యూ అధికారి కిషన్‌నాయక్ తెలిపారు.రేషన్‌కార్డులలో భూత్పూర్‌కు మంజూరైన దాదాపు 305కొత్త రేషన్‌కార్డులు,2329 మంది కొత్తవారిని ఉన్న రేషన్‌కార్డులలో కొత్తగా నమోదు చేసిన (కలివి)నవిగా ఎమ్మార్వో పేర్కొన్నారు.లబ్ధిదారులు,కార్డుహోల్డర్లు సకాలంలో హాజరై ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా అందజేసే రేషన్‌కార్డులు పొందాలని ఎమ్మార్వో కిషన్‌నాయక్ కోరారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వెల్దండ, జూలై 25 ప్రభాతవార్త:మండలంలోని పెద్దాపూర్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఎంఈఓ చంద్రుడు అధ్యక్షతన మండల లెవెల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రుడు మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి చదువులలో వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈఓ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ నిర్వహణ పాఠశాల పరిశుభ్రత విద్యార్థుల యొక్క బేస్ లైన్ ప్రగతిని పరిశీలించడం, ఎఫ్ఎల్ఎన్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నేర్పించడం పద్యాలతో మధ్యాహ్నం భోజనం సంబంధించిన వివరాలను చర్చించారు. సమావేశంలో వెల్దండ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రవీందర్, రాజశేఖర్, రిసోర్స్ పర్సన్ విష్ణు, స్వామి, రాజు, సిఆర్పి అంజానాయక్, చంద్రశేఖర్, ఆంజనేయులుతో పాటు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రుడు

గుండె పోటుతో యువ రైతు మృతి

మద్దూర్, జూలై 25 ప్రభాతవార్త : గుండె పోటుతో ఓ యువ రైతు మృతి చెందిన ఘటన నారాయ ణ పేట జిల్లా మద్దూరు మండలంలోని చెన్నా రెడ్డి పల్లిలో జరిగింది. గ్రామస్తులు, కుటుంభ సభ్య లు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దివంగత నంపుల హన్మి రెడ్డి కొడుకు నంపుల గుర్నాథ్ రెడ్డి (41)కు శుక్రవారం తెల్లవారు జామున చాతీలో నొప్పి వస్తుందని తన భార్య రజినితో చెప్పాడు. నొప్పి తీవ్రత ఎక్కువ కావడంతో 4 గం.లకు తన స్నేహితుడు వెంకట్ రెడ్డి వద్దకు వెళ్ళాడు. అతను హుటాహుటిన తన కారులో మద్దూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆ సమయంలో వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. 108 కు ఫోన్ చేసి మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ చెక్ చేసి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. మృతునికి భార్య,ఇద్ద రు కొడుకులు ఉన్నారు. గుర్నాథ్ రెడ్డి మంచి మనసున్న వ్యక్తి అని చిన్న వయసులో అకాల మర ణం చెందడంతో కుటుంభ సభ్యులు, స్నేహితులు గుండెలు అవిసేలా ఏడ్చారు.

వైభవంగా వాసవీ మాతకు పూలతో లక్ష పుష్పార్చన

మక్తల్ టౌన్,జూలై 25 ప్రభాతవార్త:వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని ఐదు శుక్రవారాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు మనసాని సరళ దేవి తెలిపారు. వారు మాట్లాడుతూ మొదటి శుక్రవారం నాడు లక్ష పుష్పలతో అమ్మవారికి లక్ష పుష్పార్చన, 108 లలిత సహస్రనామవాళితో అమ్మ వారికి లక్షపుష్పర్చన కార్యక్రమం ఆర్యవైశ్య మహిళలచే వైభవంగా నిర్వహించామని,అలాగే రెండవ శుక్రవారం 102 కేజీల పసుపుచే 108 లలిత సహస్రనామాలు పారాయణం చేస్తూ అమ్మ వారికి సమర్పిస్తామని, మూడవ వారం వరలక్ష్మివారం అమ్మవారికి కొత్త చీరలతో అలంకరణ ఉంటుందని, నాలుగవ వారం 102 కేజీల కుంకుమతో లలిత సహస్రనామాలు చదువుతూ అమ్మ వారికి కుంకుమ అభిషేకం చేస్తామని, ఐదవ వారం ముత్యాలతో 108 లలిత సహస్రనామాలు పారాయణం చేస్తూ అమ్మవారికి సమర్పిస్తామని, 5 శుక్రవారాలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. నేడు సాయంత్రం అమ్మవారి పల్లకి సేవ, రథోత్సవం ఆలంపల్లి నాగరాజ్, కల్పాల్ ప్రసన్న కిషోర్ దంపతులచే రథోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష పుష్పార్చన చేసిన మహిళలు

మీ సేవ నూతన సర్వీస్‌పై శిక్ష

నారాయణపేట ప్రతినిధి, జూలై 25 ప్రభాతవార్త: మీ సేవలో నూతన సర్వీస్ మీద శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని మీ సేవ ఆపరేటర్లకి శిక్షణ కార్యక్రమము నిర్వహించటం జరిగింది. ప్రస్తుతం ఉన్న సర్వీసెస్‌తో పాటు నూతనంగా కమ్యూనిటీ రీ ఇష్యూ సర్టిఫికేట్ ద్వారా ప్రజలు ప్రతి సంవత్సరం మళ్ళీ మళ్ళీ కాస్ట్ తీసుకోవలసిన అవసరం వస్తె నూతన విధానముపై జిల్లాలోని అన్ని మీ సేవ కేంద్రాల ఆపరేటర్‌కి అవగాహన కల్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ జిల్లా మేనేజర్ విజయ్ కుమార్, మీ సేవ సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి అలాగే జిల్లా ఆపరేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

నరక ప్రాయంగా మారిన రహదారులు

ఉప్పునుంతల, జూలై 25 ప్రభాతవార్త : మండలంలో రహదారులు గోతులు ఏర్పడి పాద చారులు నడవలేని దుస్థితి మండలంలో నెలకొంది. అచ్చంపేట నుంచి ఉప్పునుంతల మీదుగా మొల్గర, పెద్దాపూర్, లక్ష్మాపూర్, మామిళ్ళపల్లి మీదుగా రాకొండ ఆర్‌అండ బీ రోడ్డు వరకు బీటి రోడ్డు ఉన్నప్పటికీ ఇసుక ట్రాక్టర్లు, ఇసుక టిప్పర్ల తాకిడికి రోడ్డు అధ్వానంగా తయారయింది. ఇసుక మాఫియా దారులు ఇదే ప్రధాన రహదారి ఎంచు కోవడంతో బీటీ ఎగిరి పోయి గోతులు ఏర్పడ్డాయి. కనీసం వాటిపై మట్టి పోసే నాథుడే కరువయ్యాడు. ఇసుక తరలింపు పై చూపిన శ్రద్ధ రహదారులపై ఎందుకు చూపడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మాఫియా ను ప్రోత్సహిస్తున్న వారిని ప్రశ్నిస్తున్నారు. తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో వారిపట్ల ఆయా గ్రామాల ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఏనాడు వాటి మరమ్మత్తుల పట్ల దృష్టి సారించడం లేదు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన మండల కేంద్రమైన ఉప్పునుంతల శివారు గ్రామమైన కొత్త రాంనగర్‌కు స్వాతంత్రం రాలేదు. ఎంతోమంది ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లిన తమ గోడు పట్టించుకున్న పాపాన పోలేదు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఉప్పునుంతల నుంచి కొత్త రామ్‌నగర్ వరకు రోడ్డు మార్గం చేయిస్తామని హామీల మీద హామీలు ఇస్తారు కానీ ఎన్నికలు అయిపోయిన తర్వాత వారి పట్ల, ఆ గ్రామ అభివృద్ధి పట్ల ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఉప్పునుంతలకు రావాలంటే వారు నరకయాతన అనుభవించాల్సిందే. 4 కిలోమీటర్లు రావడానికి నాలుగు లోకాలను తలపించే విధంగా నరకం అనుభవిస్తూ ప్రజా ప్రతినిధుల పట్ల శాపనార్థాలు పెట్టుకుంటూ నిత్యం రాకపోకలు నిర్వహిస్తున్నారు. ఈ మార్గం గుండా కనీసం నడవడానికి వీలు లేకుండా పోయింది. ఒకవేళ ద్విచక్ర వాహనం పై వెళ్తే వారికి చుక్కలు కనిపించాల్సిందే. ఉప్పునుంతల నుంచి కొత్త రామ్ నగర్ కు రోడ్డు మార్గం వేయించకపోవడం పట్ల అంతర్యం ఏమిటని మండల ప్రజలతో పాటు ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని మండలంలో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయించుకుంటూ, ఉప్పునుంతల నుంచి కొత్త రామ్ నగర్ వరకు రోడ్డు వేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నియోజకవర్గంలోనే ఇండ్ల నిర్మాణాన్ని గాని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని కానీ ఇసుక అందుబాటులోకి వచ్చేది మొల్గర సమీపంలో ప్రవహిస్తున్న దుందుభి వాగు నుంచి తరలించవలసిందే, అయినప్పటికీ నాయకులు చొరవ తీసుకోకపోవడం పట్ల పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పోతిరెడ్డిపల్లి సమీపంలో టిప్పర్ల ద్వారా ఇసుక లోడ్ చేసుకొని ఇదే మార్గం గుండా రావడంతో రోడ్లు మరింత దెబ్బతింది. ఎవరికి ఉపయోగం రాకుండా ఇసుకను హైదరాబాద్‌కు తరలించడం ఈ మార్గం గుండా వెళ్లడం సరికాదని ఉప్పునుంతల మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మండలంలో దెబ్బతిన్న రోడ్లను సత్వరమే మరమ్మతులు చేపట్టాలని, ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ వరకు రోడ్డు మార్గాన్ని వెంటనే పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మొల్గర వద్ద దెబ్బతిన్న బీటీ రోడ్డు

ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్‌రోడ్డు పరిస్థితి

బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి

అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి వీరారెడ్డి

అమరచింత జూలై 25, ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఆహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ స్వర్గీయ వీరారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రశాంత్ రెడ్డి అన్నారు. మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ వీరారెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అలాగే డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, స్వర్గీయ వీరారెడ్డి హాయంలో ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ కాలనీలు ఏర్పాటు చేసి దళితుల హక్కులను కాపాడారని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ పాలనలో రైతులకు డిసిసిబి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి రైతులను రాజులు చేసిన వ్యక్తి వీరారెడ్డి అని ఆయన అన్నారు. వీరారెడ్డి ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త వచ్చే స్థానిక ఎన్నికల్లో సైనికుల పనిచేసే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వ్యక్తులను గెలిపించుకోవాలని ఆయన కార్యకర్తలను కోరారు. మక్తల్ నియోజకవర్గం లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో ఐక్యమత్యంతో అభివృద్ధి చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అమరచింత మండలం మాజీ అధ్యక్షులు, జుబేర్ అహ్మద్, మాజీ ఎంపిటిసి, తిరుమలేష్, జిఎం విష్ణు యాదవ్, మన్నన్, అయూబ్ ఖాన్, కుమ్మరి బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అమరచింత డిఎంఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ఆత్మకూర్ జూలై 25, ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత శాసనసభ ఎన్నికల సమయంలో చేయూత పెన్షన్లు పెంపు మాట తక్షణమే నిలబెట్టుకోవాలని ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి జంగయ్య మాదిగ విజ్ఞప్తి చేశారు శుక్రవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రాంగణంలో జరిగిన వికలాంగుల పెన్షన్ మరియు వితంతుల పెన్షన్ లబ్ధిదారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ కేవలం మాదిగ హక్కుల కోసం ఆవిర్భవించినప్పటికీ కాలక్రమేనా సమాజంలోని ప్రతి ఒక్కరి హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్న విషయాన్ని ప్రజలందరూ గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు గత ప్రభుత్వ హయాంలో వికలాంగులకు పెన్షన్లు పెంచే పద్ధతిని ఎమ్మార్పీఎస్ ఉద్యమాల ద్వారానే అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు పెంపుదల చేయడం జరిగిందని గత శాసనసభ ఎన్నికల సమయంలో మాత్రం కాంగ్రెస్ నాయకులు వికలాంగులకు 6000 పెన్షన్ ఒంటరి మహిళ మరియు చేయూత పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ పంపిణీ చేస్తామంటూ ఇచ్చిన హామీని తక్షణమే నిలబెట్టుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు అందులో భాగంగానే ఆగస్టు 13వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాదులోని లాల్ బహుదూర్ స్టేడియంలో పెన్షన్దారుల మహాగర్జన ఉంటుందని ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు తరలివచ్చి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ ఆత్మకూరు మండల అధ్యక్షులు దండు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ నాయకులు అజపాక లక్ష్మణ్ జానకి రాములు గారి పంపు శ్రీనివాసులు సోంబాబు, బుచ్చన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్చార్జి జంగయ్య

కమ్యూనిటీ హాల్‌లకు నిధుల మంజూరు : బిజెపి నాయకుల హర్షం

చిన్నచింతకుంట, జూలై 25 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని వాల్మీకి,ముదిరాజు కుల సంఘాలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు ఎంపీ నిధులను మంజూరు చేయడంపై పట్ల బిజెపి నాయకులు నంబి రాజు, కుర్వ రమేష్ దశరథ్‌లు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశ అభివృద్ధిలో భాగంగా గ్రామాలు కూడా అభివృద్ధి చెందాలని ఉపాధి హామీ కింద రోడ్ల, డ్రైనేజీ నిర్మాణాలకు ఊహించని నిధులు కేటాయిస్తున్నారన్నారు. దానిలో భాగంగా మోడీ నేతృత్వంలోని ఎంపీ డీకే అరుణమ్మ మండల బీజేపీ శాఖ అడిగిన వెంటనే రెండు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ముదిరాజ్,వాల్మీకి కమ్యూనిటీకి ఒక్కొక్కటీ రూ.9 లక్షల చొప్పున మొత్తం రూ.18 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు .ఎంపీ అరుణమ్మ కు బీజేపీ మండల శాఖ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మండలంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ నిధులనుంచి రోడ్లకు, డ్రైనేజీ లకు రూ.20 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. భవిష్యత్తులో అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్రం, ఎంపీల ద్వారా నిధులు తెస్తామని బిజెపి నేతలు తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు ఆకుల అంజన్న, దాసరి చంద్రుడు, లంకాల రవి, సురేందర్, నర్సింలు, నాగేష్, చంద్రన్న, ఆవుల రాజు, గొల్ల బాలన్న, శ్రీను, వికాస్, నరసింహ, రేషం చంద్రన్న, మామిళ్ళ మాసన్న, రాజేష్, శంకర్, గుజ్జుల శ్రీను, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి నేతలు

ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి

వనపర్తి, జూలై 25 ప్రభాతవార్త : వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత ఎంతో ప్రధానమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం కొత్తకోట మండల పరిధిలోని రామంతపూర్ గ్రామంలో డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత పై సిబ్బంది ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత ఎంతో ప్రధానమని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని గ్రామస్తులకు సూచించారు. ఇండ్ల పరిసరాల్లో నిల్వనీరు, పాత టైర్లు, మరి ఏమైనా పాత వస్తువులు ఉంటే వాటిని తీసివేయాలని అలాంటి వాటివల్ల దోమలు పెరిగి సీజనల్ వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. మురుగుకాలువలు పారే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి డ్రైడే డ్రైడే కార్యక్రమం గురించి తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో ఓ చిన్నారి డెంగ్యూ బారిన పడగా వారి ఇంటికి వెళ్లి పరిస్థితి ఎలా ఉందని తెలుసుకున్నారు. పాప ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన రిపోర్టులను చూశారు. ఇతరులకు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయాలి రామంతపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ తిరిగి పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మాణ ప్రక్రియ దశలవారీగా పూర్తి చేసిన వెంటనే ఫోటోలు అప్లోడ్ చేయాలని పంచాయతీ కార్యదర్శి ఆదేశించారు. పేమెంట్లలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఇంకా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎవరైతే గ్రౌండింగ్ ప్రారంభించలేదో వారు వెంటనే నిర్మాణం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, ప్రాజెక్టు ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి, హౌసింగ్ శాఖ అధికారి విభోభా, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరిస్తున్న కలెక్టర్

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రైతులు పంట పొలాల్లో

నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి రమేష్

ఉప్పునుంతల,జూలై 25 ప్రభాతవార్త:ప్రస్తుతం వర్షాల కారణంగా రైతులు పంట పొలాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ తెలిపారు. నీరు నిల్వ ఉంటే వెంటనే పొలం నుంచి బయటికి వెళ్ళే విధంగా చూసుకోవాలని, ఒకవేళ పంట పొలాల్లో ఎక్కువ నీరు వచ్చి పంట నీటిలో మునిగి ఉంటే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంటుందని (వేరు, కుళ్ళు, తెగులు) వస్తాయని కావున రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి సూచించారు. ఒకవేళ పంటలు నీటిలో మునిగితే మాస్కో జబ్, కార్బ నెంధీ జం 1 కెజి ఎకరం మొక్కల యొక్క మొదలలో స్ప్రే చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి రమేష్ వివరించారు.

పాఠశాల అభివృద్ధిలో

ప్రధానోపాధ్యాయుడు కీలకం

మండల విద్యాధికారి ఎస్. జయ రాములు

పెబ్బేరు, జూలై 25 ప్రభాతవార్త : పెబ్బేరు పట్టణంలో జడ్పీహెచ్ఎస్ నందు నిర్వహించిన పాఠశాల సముదాయ కార్యక్రమంలో ఈసారి పెబ్బేరు మండలంలో పాఠశాల విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచిన ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మా నించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్.జయరాములు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుడు కీలక పాత్ర అని, ప్రధానోపాధ్యాయుని చొరవతో ప్రతి పాఠశాలను అభివృద్ధి చేయవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ కాంప

పురవీధుల్లో వీధి కుక్కల స్వైర విహారం

● స్పందించిన మున్సిపల్ కమిషనర్

వీధి కుక్కలను పట్టుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

వనపర్తి, జూలై 25 ప్రభాతవార్త: వనపర్తి మున్సిపాలిటిలో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. మున్సిపాలిటిలోని కాలనీలలో గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రి సమయాలలో సైతం రోడ్లపైకి వచ్చి నడుచుకుంటూ వేళ్లే వారిపై వీధి కుక్కలు దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటిలో గతంలో చిన్నారులు కుక్కల భారీన పడి గాయాల పాలైన మున్సిపల్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపించాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని 24 వార్డులో ప్రజా సేవకులు వజ్రాల రమేష్ కాలనీలో ఉండే వీధి కుక్కలపై సమాచారాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ శుక్రవారం కాలనీలో ఉండే వీధి కుక్కలను పట్టించడం జరిగింది. స్పందించిన మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

కనీస వసతులు లేకుండానే ప్రైవేట్ పాఠశాలలు కొనసాగింపు

● అసహనం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు ● కరువైన మండల విద్యాధికారి పర్యవేక్షణ

నవాబుపేట, జూలై 25 ప్రభాతవార్త: ప్రైవేట్ పాఠశాలల్లో కనీస వసతులు కరువయ్యాయి. ఫీజుల వసూలుపై ఉన్న శ్రద్ధ, వసతుల కల్పనపై చూపించడం లేదని తల్లి దండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేకపోవడంగమనార్హం. ఒంటికీ, రెంటికీ ఆరుబయటికే. పలు ప్రైవేట్ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉండడం లేదు. దీంతో విద్యార్థులు పాఠశాలల సమీపంలోని ముళ్లపొదల చాటుకు వెళ్లాల్సి వస్తోంది. దీనికి తోడు చాలా పాఠశాలలు రేకుల షెడ్లలోనూ, ఇరుకైన అద్దె భవనాల్లోనూ కొనసాగుతున్నాయి. క్రీడా ప్రాంగణాలు కూడా లేవు. దీంతో ఉదయం ప్రార్థన చేసే పరిస్థితులు లేవు. ఆడుకునేందుకు స్థలం లేక విద్యార్థులు క్రీడలకు, శారీరక వ్యాయామానికి దూరం అవుతున్నారు. కొన్ని చోట్ల మాత్రం ఎక్కడో ఒకచోట ఖాళీ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మరి ఇలాంటి పాఠశాలలకుమండల విద్యాధికారి ఎందుకు అనుమతులు ఇస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు. బడుల్లోనే స్టేషనరీ విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, పెన్నులు, నోట్‌బుక్కులు, టైలు, బెల్టులు విక్రయిస్తున్నారు. బయటి మార్కెట్ ధరకన్నా అధికంగా వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పాఠశాలల్లో ఒక్కో కంపెనీ పాఠ్యపుస్తకాలు వినియోగిస్తున్నారు. వీటిని అవసరానికి మించి కొనుగోలు చేయిస్తూ తల్లిదండ్రులపై ఆర్థికభారం, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నారు. ఇప్పటికైనా నవాబుపేట మండలవిద్యాశాఖ అధికారి స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో కనీస వసతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకొని అలాంటి పాఠశాలలకు అనుమతి ఇవ్వకుండా చూడాలని ప్రజలు వాపోతున్నారు.

రైతంగాన్ని కాపాడాలంటే గిట్టుబాటు ధర చెల్లించాలి

◆ అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.కృష్ణ

నారాయణపేట టౌన్, జూలై25 ప్రభాతవార్త: అఖిలభారత ఐక్య రైతు సంఘం ప్రథమ మహా సభలు జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో జరిగాయి. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బిరాముతోబాటు ఏం.కృష్ణ మాట్లాడుతూ రైతులు సంక్షోభం నుండి బయట పడాలంటే రైతులు పండంచిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ ఫారసులను అమలు చేసి రైతు వ్యవసాయం పై పెట్టిన పెట్టుబడిపై 50 కలిపి ధర నిర్ణంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్, పెట్టుబడి దారులకు, సామ్రాజ్యవాదులకు దాసోహం చేస్తున్నాయాన్నారు. దేశంలో 2014లో బిజెపిపార్టీ అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసి రైతులను ధనవంతులుగా మారుస్తానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే కార్పొరేట్ వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతులకు గుదిబండగా మార్చారు. దేశ రైతాంగం కార్పొరేట్ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఢిల్లీ కేంద్రంగా ఉద్యమించి సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ కోరుతూ నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. వీటిని అమలు చేయకపోగా దొడ్డిదారిన మళ్లీ కార్పొరేట్ అనుకూలమైనటువంటి నూతన జాతీయ మార్కెట్ విధాన బిల్లును ఆమోదింప చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భగవంతు, బి.యాదగిరి, సలీం, కె.కాశినాథ్, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, కృష్ణయ్య, సహాయ కార్యదర్శిలు కొండ నర్సిములుతో బాటు తదితరులు ఉన్నారు.

ఒకే నినాదం ఒకే విధానం ద్వారా తీసుకొచ్చే సంస్థనే హిందూవాహిని

● హిందూవాహిని ద్వి రాష్ట్రాల అధ్యక్షులు రాజవర్ధన్‌రెడ్డి

మాట్లాడుతున్న రాజవర్ధన్ రెడ్డి

వనపర్తి రూరల్, జూలై 25 ప్రభాతవార్త: హిందువులను అందరినీ ఏకాధాటిగా ఒకే నినాదం, ఒకే విధానం ద్వారా తీసుకొచ్చే సంస్థనే హిందూవాహిని అని హిందూ వాహిని ద్విరాష్ట్రల అధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు వనపర్తి పట్టణం కేంద్రంలోని ఒక ప్రైవేట్ హాల్‌లో హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ ప్రముఖుల సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు కులాలను ప్రక్కకు పెట్టి మనమంతా ఒక్కటే అనే భావనను చాటిచెప్పే సమయం వచ్చిందని, అంతే కాకుండా మన వంశాపారపర్యంగా వస్తున్న కులాల వారి వృత్తిని గౌరవిస్తూ పర మతాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి ఒక్కరు నేర్చుకొని మనకంటూ స్థానాన్ని సంపాదించుకోవాలని కోరారు. కేవలం మన దేశ యువతనీ, ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయడానికే కొన్ని శత్రు దేశాలు పన్నిన కుట్రలో భాగంగానే మన యువతను, హిందూ అమ్మాయిలను టార్గెట్ చేస్తూ ప్రేమ, బెస్టీ అనే కొత్త కొత్త పాశ్చాత్య సంస్కృతి పేరిటదగ్గరికి చేసుకొని డ్రగ్స్, గంజాయి వంటిఆరోగ్యానికి హానికరమైన వాటిని అలవాటు చేయించి సమాజాన్ని నాశనం చేయాలని కుట్ర పడుతున్నారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ మహిళలలో చైతన్యాన్ని పెంపొందిస్తూ ఇటు సమాజాన్ని, అటు పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజర్ ముదుపు యాది రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సహ సంయోజక్ హరి చంద్రరెడ్డి, విభాగ్ కన్వీనర్ అభిలాష్, జిల్లా కన్వీనర్ అరుణ్ గౌడ్, కో కన్వీనర్‌లు శ్రీకాంత్, నవీన్, పట్టణ కన్వీనర్‌నంద ,కో కన్వీనర్ మూర్తి, సంతోష్, నీలేష్, కార్తీక్, భరత్, సంతోష్, నికిల్ సాయి, తదితర జిల్లా, పట్టణ హిందూ వాహిని కార్యకర్తలు, కుల సంఘాల నాయకులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దరఖాస్తుల పరిశీలన

వంగూరు, జూలై 25 ప్రభాతవార్త: పేరుకుపోయిన రైతు భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూసదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించేందుకు నిత్యం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. వంగూరు మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు 1040 దరఖాస్తులు చేసుకున్నారు. అందులో పిటిటి కింద 365 దరఖాస్తులు చేసుకోగా సాదా బైనామాలో 72 దరఖాస్తులు, వివిధ సమస్యల పరిష్కారానికి 603 దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ మురళీ మనోహర్ తెలిపారు. అందులో 90దరఖాస్తులను పరిశీలించి ఆర్డీఓకు పంపించినట్లు తెలిపారు. మిగతా వాటిని ఆగస్టు 14 వరకు పూర్తిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. పిటిటి కింద దరఖాస్తు చేసుకున్న రైతులుఆ భూమికి సంబంధించిన దస్తావేజులు సరైనవి ఉంటే పరిశీలించి రైతుల పేరుపై నమోదు చేయాలని ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రైతులు చేసుకున్న దరఖాస్తులు పరిశీలిస్తున్న క్రమంలో వారికీ చరవాణి ద్వారా సమాచారం అందించి దరఖాస్తుకు సంబందించిన పత్రాలను తీసుకొని రావాలని చెప్పడం జరుగుతుందని వివరించారు. రైతులు చేసుకున్న దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

స్థానిక సమరానికి సై

మొదటి పేజీ తరువాయి భాగం..

స్థానానికిమాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాచూరిచంద్రమౌళి ప్రధానంగా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక జాతీయ పార్టీ బీజేపి నుంచి జెడ్పీటీసీకి మద్దిగట్ల కూచుకూళ్ల రవీందర్‌రెడ్డి పేరు ప్రధానంగా వినవస్తోంది. ఎంపిపి పదవికి ఇదమిత్థంగా వీరని ఇంతవరకు ఎవరి పేరు ఖచ్చితంగా బయటప డలేదనే చెప్పాలి. ఇక మున్సిపాలిటీ అంశానికొస్తే పదివార్డులలో నాల్గెదు మంది ఆశావహులు ఒక్కొవార్డు నుంచి పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ అభ్యర్థిగా అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి లిక్కి నవీన్‌గౌడ్‌ప్రధానంగా రేసులోఉన్నారు. నవీన్ అభ్యర్థిత్వాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ ఇంచుమించు ఖరారు చేసినట్లుకూడా విశ్వసనీయ సమాచారం. బీఆర్ఎస్ నుంచి టిమురళిధర్‌గౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్‌ల పేర్లు ప్రధానంగా వినవస్తున్నాయి. వీరిలో ఇంతవరకు ఏ పదవి చేపట్టని టీఎంగౌడ్ వైపేమాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డితో పాటుపార్టీ అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక బీజేపీ నుంచి కెండ్యాల శ్రీనివాస్(ఐదిండ్ల శ్రీను), బీజేపీ మైనార్టీ మోర్చాజిల్లా అధ్యక్షుడుఎండి ఫారూక్‌లు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇక కౌన్సిలర్ పదవులకు పదివార్డులలో లెక్కకు మించిన అభ్యర్థులు రంగంలో ఉండగలరనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

విద్యార్థులు బట్టిపట్టే విధానానికి స్వస్తి చెప్పాలి

◆ పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ ఆదర్శ సురభి

కంప్యూటర్ గదిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

వనపర్తి, జూలై 25 ప్రభాతవార్త: మదనాపురం మండల పరిధిలోని కొన్నూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ గిరిధర్‌రావుల సందర్శించారు. శుక్రవారం గ్రామానికి చెందిన సయ్యద్ గూద్సా అనే వ్యక్తి విద్యార్థుల కు అందరికీ ఉచితంగా బూట్లు, టై, బెల్ట్ పంపిణీ చేసేందుకు ముందుకు రాగా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ హాజరై, వాటినిపంపిణీ చేసిదాతను అభినందించారు. అదేవిధంగా పాఠ శాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేక పోవడంతో మహేష్ అనే స్థానిక యువకుడు వ్యాయామ శిక్షణ ఇస్తుండడంతో అతన్ని కూడా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్నూరు పాఠశాలలో గొప్ప సదుపాయాలు ఉన్నాయని, పాఠశాల చాలా బాగుందని అభినందించారు. దాతలు సహకారంతో పాఠశాల అభివృద్ధి చేశారు కాబట్టి విద్యార్థులు కూడా బాగా చదువుకొని మంచి ఫలితాలు తెచ్చుకొని గొప్ప పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు బట్టీపట్టే విధానానికి స్వస్తి చెప్పి, మెలకువలు నేర్చుకొని పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు అని విద్యార్థులకు తెలియజేశారు. దాతలు ఎంతో శ్రమించి పాఠశాలను ఈ విధంగా అభివృద్ధి చేశారు కనుక ఈ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ గుర్తుచేశారు. విద్యార్థులకు కావాల్సిన సామాగ్రిని అందించేందుకు ముందుకు వచ్చిన దాత గుద్సాను కలెక్టర్ అభినందించారు. పాఠశాలలో ఈ సంవత్సరం 100 విద్యార్థులు పాస్‌అయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా వెనుకబడిన విద్యార్థులు ఉంటే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి సామర్థ్యాలను పెంపొందింప చేయాలన్నారు. విద్యార్థులు గణితంలో మెలు కువలు నేర్చుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్‌వారికి గణితంలో పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. అంతకుముందు, పాఠశాలలో కంప్యూ టర్ ఆధారంగా విద్యార్థుల కు చదువు నేర్పించ డం కోసం ఏర్పాటు చేసిన తరగతి గదిని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు ఏఐ ద్వారా చదువు నేర్చు కుంటున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రత్యేకంగా లాగిన్ ఐడీలు ఇచ్చి తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ గిరిధర్ రావుల మాట్లాడుతూ గ్రామానికి చెందిన గుద్సా, మహేష్ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయడం అభినం దనీయమని ప్రశంసించారు. విద్యార్థులు కూడా దాతలు చేస్తున్న సహకారాన్ని గుర్తుపెట్టుకొని భవిష్యత్తులో తాముకూడా ఇతరులకు సహాయం చేయవలసిన సమయం వచ్చిన ప్పుడు తప్పనిసరిగా ముందుండాలని చెప్పారు. పాఠశాల ఆవరణలో మంచి మొక్కలునాటి పరిశుభ్రవాతావరణన్ని ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకొని చదవడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగ డానికి అవకాశం ఉంటుం దని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాల ను వింటూనే, వ్యక్తిగత పరిశుభ్రతను కూడా అలవర్చు కోవాలని గుర్తు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పాఠశాల పరిశుభ్రతనుకూడా కాపాడుకోవాలన్నారు. విద్యార్థులకు సామాగ్రి పంపిణీ చేసిన దాతను ఎస్పీశాలువాతో సత్కరించారు. కార్యక్ర మంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, తహసిల్దార్ మోహన్, ఎంపిడివో, ఇతర ఉపాధ్యాయులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రాథమిక దశలోనే బలమైన పునాది వేయాలి

◆ నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్

విద్యార్థుల యొక్క విషయ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

కల్వకుర్తి, జూలై 25 ప్రభాత వార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక విద్య దశలోనే బలమైన బోధన జరిగితే, విద్యార్థులు ఉన్నత స్థాయిలో సైతం విజయం సాధించగలుగు తారని, అంతేకాకుండా, వారు సమాజానికి బాధ్యతాయు తమైన పౌరులుగా ఎదుగుతారని, ఉపాధ్యాయులు తమ భోజనం పద్ధతుల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం చారకొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ప్రాథమికస్థాయి ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి డీఈఓ రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఇస్తున్న శిక్షణ తరగతులను డీఈఓ పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులలో విద్యా సామర్థ్యాలు పెంచడానికి ఉపాధ్యాయులు 100 శాతం కృషి చేయాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. ఉపాధ్యాయులు తరగతిగదిలో సమర్థవంతమైన బోధనా పద్ధతులను అవలంబించి, తరగతి, స్థాయిల వారిగా విద్యార్థుల అవసరాలు, ప్రతిభకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలని నూతన పద్ధతుల ద్వారా బోధనను ఆకర్షణీయంగా చేయాలని సూచించారు. అంతకు ముందు సిర్సనగండ్ల ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీకి చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను డీఈఓ ఆదేశించారు. అనంతరం చారకొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిసరాలను డీఈఓ పరిశీలించారు. రుచికరమైన భోజనాన్ని ఆరోజువారి మెనూ ప్రకారం విద్యార్థులకు అందజేయాలని పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం వండాలని సూచించారు. పదో తరగతి గదిలో విద్యార్థులతో డీఈఓ మాట్లాడారు. తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి విద్యార్థి అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం చేయాలని డీఈఓ రమేష్ కుమార్ తెలిపారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టెస్ట్‌బుక్ మేనేజర్ నరసింహులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలి

● భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్‌రెడ్డి

నారాయణపేట టౌన్, జూలై 25 ప్రభాతవార్త: పేద విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా.కె.రాజ్ కుమార్‌రెడ్డి అన్నారు. నారాయణపేట మాడ్రన్ స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థుల సౌకర్యార్థం ఎల్ఈడీ టీవీనిశుక్రవారం పాఠశాలలో నిర్వాహకులకు ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాజ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు తమ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలకు టీవీలను అంద జేయడం జరిగిందని వివరించారు. అదేవిధంగా పదవతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత చదువులు చదువుకునేందుకుఆర్థిక సహాయం చేసినట్లు ఆయన తెలిపారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం తమ ఫౌండేషన్ తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మక్క ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ఖలీల్, అహ్మద్ తాజ్, మాడ్రన్ స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ ఖాదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జకీర్ హుస్సేన్, తాజ్, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, రాఘవేందర్‌గౌడ్‌తో బాటు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక బస్సులకు స్టాప్ ఇవ్వాలి

బీజేపీ ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప

కృష్ణ, జూలై 25 ప్రభాతవార్త: క్రిష్ణ మండలం కున్సీ మీదుగా రాయచూరు, యాదగిరి వెళ్లే జాతీయ రహదారిపై ప్రయాణికుల సౌకర్యార్థం కర్ణాటక ఆర్టీసీ బస్సులు ఆపకుండా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్నారని ఉమ్మడి మండల బిజెపి అధ్యక్షుడు నల్లే నర్సప్ప అన్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కున్సీ అలంపల్లి, చేగుంట గ్రామాల నుండిఅనునిత్యం వాణిజ్య, వ్యాపార, విద్య, ఆరోగ్య అవసరాల నిమిత్యం రాయచూరు, యాదగిరి, శక్తినగర్, గుల్బర్గా తదితర పట్టణాలకు వందలాది మంది వెళ్తారని, అయినా కూడా కర్ణాటక ఆర్టీసి అధికారులు నిర్లక్ష్యం వహించి ఇక్కడస్టాప్ ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ విషయమై రాయచూరు, యాదగిరి ఆర్టీసి డిపో మేనేజర్‌ల దృష్టికి అఖిల పక్షం నాయకులు తీసుకువెళ్లిన కూడా ఫలితం లేనందున ధర్నాకు దిగామన్నారు. ఈ నిరసన ఇంతటితో ఆగకుండా భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి అధికారులు దిగి వచ్చి బస్సుల స్టాప్ ఇవ్వాలని, లేనియెడల పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి రాస్తారోకోలుతో స్తంభింపజేస్తామని నల్లే నర్సప్ప హెచ్చరించారు. ఈ నిరసనలో మహిళలు, అఖిల పక్షం నాయకులు మాజీ ఎంపీపీ లింగప్ప, మాజీ సర్పంచ్‌ధర్మరాయ, మాజీ ఉపసర్పంచ్ బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు పల్లె సురేష్, శరణప్ప గౌడ, ఖందొడ్డి నారాయణ, మల్లనగౌడ్, మహాదేవ్, చందు, సాయిబాన్న, బలేం కిష్టప్ప, శామ్‌గౌడ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గ్రామాల ప్రజలు, బిజెపి నాయకులు

పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థుల్లో బోధన నైపుణ్యాలు పెంపొందించాలి

● మండల విద్యాధికారి కృష్ణారెడ్డి

దామరగిద్ద, జూలై 25 ప్రభాతవార్త : జడ్పిహెచ్ఎస్ దామరగిద్ద పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రాథమిక పాఠశాల స్థాయి సముదాయ సమావేశం మండల విద్యాధికారి శ్రీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి మాట్లాడుతూ పాఠశాల వారీగా సమీక్ష చేస్తూ, గ్రంథాలయ నిర్వహణ ఏ విధంగా చేయాలి, విద్యార్థులకు పుస్తక పఠనం పై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గ్రంథాలయ పుస్తకాలుఅన్ని పాఠశాలలకు అందచేశారు. అదేవిదంగా నారాయణ పేట జిల్లాలోనే దామరగిద్ద మండలంలో వివిధ పాఠశాలల్లోవిద్యార్థుల సంఖ్యగణనీయంగా పెరిగిందని అన్నారు. ఎఫ్ఎల్ఎన్‌లో నిర్వహించిన ప్రారంభ పరీక్షలు విద్యార్థుల స్థాయిని బట్టివారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచిం చారు. జిహెచ్ఎంలు అన్నపూర్ణ, సత్యనారాయణ, ఎఫ్ఎసి జ్యోతి, మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం ఖచ్చితంగా రావాలని సూచించారు. తరగతి గది బోధనలో బోధనోపకరణాలు ఉపయోగిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్స్ జానకి రాములు, రమేష్, గీత, శంకరప్ప, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. సీఆర్పీలు మహిపాల్, రాములు, నాగేందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమిపూజ

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేసిన నాయకులు

దేవరకద్ర, జూలై25 ప్రభాతవార్త: కొకుంట్ల మండల కేంద్రంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లకు ప్లానింగ్ వేసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పేదవాడి సొంతింటి కలను సహకారం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారంతో, కొకుంట్ల మండల నాయకుల ఆధ్వర్యంలోగ్రామానికి వచ్చిన ఇందిరమ్మ లబ్దిదారులయిన యేశమోని ఉమాదేవి ఇందిరమ్మ ఇల్లుకి ప్రొసిడింగ్స్ ఇచ్చి, పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, మండల ఓబిసిఅధ్యక్షులు ఆంజనేయులు, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు కురవకొండన్న, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్, సుభాష్ గౌడ్, సురక్క కురుమూర్తి, ఏషమోని రమేష్, ఎషామోని కొండన్న పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

వనపర్తి, జూలై 25 ప్రభాతవార్త : అర్ధరాత్రి మద్యం షాప్ (లిక్కర్ మార్ట్)లో గుర్తు తెలియని దుండగులు రూ.3 లక్షల 43 వేలు చోరీ చేసినఘటన వనపర్తి పట్టణ కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్సైఎస

కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన

భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజకుమార్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

దామరగిద్ద, జూలై25 ప్రభాతవార్త: భక్తుల సౌకర్యార్థం దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజకుమార్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం క్యాతనపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న నూతన కల్యాణ మండప నిర్మాణానికి దేవాలయ నిర్వాహకులు, గ్రామస్తులు, ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాజ్ కుమార్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీరభద్రేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కల్యాణమండపం లేక ఎంతో మంది భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి సహకరించాలని గతంలో దేవాలయ నిర్వాహకులు తమను కోరారని, వారి విజ్ఞప్తి మేరకు కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. త్వరలోనే దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని నిర్మించి భక్తుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. పెళ్లిల సీజన్‌లో ఇక్కడ భక్తులు వివాహాలు జరుపుకుంటారని, అలాంటి వారికి ఈ కల్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డిని, ఫౌండేషన్ సభ్యులను దేవాలయ నిర్వాహకులు, పురోహితులు శాలువాలతో సత్కరించి స్వామి వారి ఫోటోను బహూకరించారు. అంతకు ముందు దేవాలయంలోస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు నారాయణ, ఉపాధ్యక్షులు బసంత్ రాజ్ పటేల్, కోడ్లీ శరణప్ప, బసిరెడ్డి, మోహన్ రెడ్డి, గంగాధర్, పురోహితులు శివకుమార్, శరణయ్య, గణేష్, చెన్ను, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న,రాఘవేందర్‌గౌడ్, చల్లా వెంకటేష్, నర్సింహానాయుడు, ఎం.సంతోష్, నందుకుమార్, వై.సంతోష్,నర్సింహ, శ్రీనివాస్,అశోక్, ప్రవీణ్, విజయ్,రాజు, భక్తులు ధానప్ప, రాములు, వీరేష్, లాలప్ప, వెంకటయ్య, వెంకోబా, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం కాలనీవాసుల ఇబ్బందులు

◆ బోరు వేయించిన భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కే. రాజ్ కుమార్‌రెడ్డి

నారాయణపేట టౌన్, జూలై25 ప్రభాతవార్త: నారాయణపేట పట్టణంలోని 11వ వార్డు పళ్ల బుజుర్గ్ కాలనీవాసులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కే.రాజ్‌కుమార్‌రెడ్డికి తెలపడంతో స్పందించిన కే.రాజ్ కుమార్ రెడ్డి శుక్రవారం బోరు వేయించారు. పుష్కనంగా నీళ్లు పడ్డాయి. దీంతో కాలనీవాసులంతా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రాజ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీకాంత్, సిద్దు,శ్యామ్, ఎల్లప్ప శివ, శ్రీనివాస్ రెడ్డి, లింగప్ప, ఫరీద్ తిప్పన మధుసూదన్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్‌తో బాటు ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

విరూపాక్ష విద్యారణ్య స్వామి మఠం భూములు రక్షించాలి

మఠం పేరిట పట్టాదారు పాసు బుక్కులు కల్పించాలంటూ అడిషనల్ కలెక్టర్‌కి వినతి

అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నారాయణపేట ప్రతినిధి, జూలై 25 ప్రభాతవార్త: జిల్లాలో శంకర భారతి పేరిట విస్తరించి ఉన్న విరూపాక్ష విద్యారణ్య స్వామిమఠం హంపి కర్ణాటక వారి భూముల, పరిరక్షించి మఠంపేరిట పట్టాదార్ పాస్ బుక్కులను మంజూరు చేయాలని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మఠం భక్త మండలి తరఫున కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుండి కూడా కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో ఉన్నహంపి మఠంపేరిట నారాయణపేట జిల్లాలో ఉట్కూరు, నారాయణపేట, దౌల్తాబాద్, కల్వకుర్తి, అచ్చంపేట మండలంలో అలాగే నాగర్‌కర్నూలు జిల్లాలోని తిమ్మాజిపేట, ఆవంచ మండలంలో తదితర గ్రామాలలో విస్తరించబడి ఉన్న భూములలో ఇప్పటికే చాలా ఎకరాలు నకిలీ కాగితాలను సృష్టించి అక్రమ పట్టాలను చేసుకున్నారని మిగిలిపోయిన మఠం భూములను కూడా భూభారతి చట్టాన్ని అడ్డం పెట్టుకొని దొంగ సాదా బైనామాలను సృష్టించుకుని దొంగ జీపీఏలను, ఓఆర్సీలను సృష్టించుకుని స్థానిక తహసిల్దార్లు రెవెన్యూ అధికారుల సహకారంతో పాస్ బుక్కులు సృష్టించుకోబోతున్నారని తెలిసినది. వాటి నివారణకోసం హంపి పీఠం భక్తులందరూ ఏకమై జిల్లా అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. ఆయా మండల తహసిల్దారులకు తగుసూచనలు ఇచ్చి పీఠం భూముల అక్రమ బదిలీలను ఆపివేయాలని, ఇప్పటికే జరిగిన ఉట్కూరు మండలంలోని 93,97 సర్వే భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హంపి పీఠం భక్తజన మండలి సభ్యులు వేలగిరిరావు కాంబ్లే టి.రామచంద్రయ్య అడ్వకేట్, డా. కేతన్ రఘునాథ్ ,ప్యార్సాని శివకుమార్, ఆర్టిసి హనుమంతు పల్ల వెంకట్రాములు ఇనామ్ దార్ సైదప్ప,గౌరీ శంకర్, గుత్తి రమేష్ ఉన్నారు.

బురదమయంగా మారిన రోడ్డు..
వరి నాటు వేసి నిరసన తెలిపిన యువకులు

రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

ధన్వాడ, జూలై 25 ప్రభాతవార్త : మండల కేంద్రంలో శుక్రవారం బురదమైన రోడ్డుపై యువకులు వరి నాటు వేసి నిరసన తెలిపారు. బిఆర్ఎస్ యువ నాయకుడు ఇర్ఫాన్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ధన్వాడ పాతపల్లి కొత్తపల్లి ప్రజలు ధన్వాడ మండల కేంద్రంలో ఎమ్మెల్యే, ఎంపీ పుట్టిన సొంత ఊరిలో సొంత గేరిలో రోడ్డు అధ్వానంగా మారింది. గత రెండు నెలలుగా ప్రజలు ఎంత మొరపెట్టుకున్నా పటించుకోని పాలకులు ధన్వాడ ఆడబిడ్డలని మా ఊరు నుండి ఇద్దరు ఆడబిడ్డలను గెలిపించి ఒకరిని అసెంబ్లీకి ఒకరిని పార్లమెంటుకు పంపిస్తే ఎమ్మెల్యే గెలిచి రెండు సంవత్సరాలు కావస్తోన్న ఎంపీ గెలిచి సంవత్సరం దాటినా ఇప్పటివరకు ఎంపీ నిధుల్లోంచి ధన్వాడకు ఒక్క రూపాయి కూడా తేలేదు. పర్ణికమ్మా, అరుణమ్మా ఇద్దరు సొంత ఊరికి చేసిందేమీ లేదు ప్రజలను పట్టించుకుందేమి లేదు. తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికల వరకు రోడ్డు వేయించాలి. లేకపోతే మీకు ఓట్లు అడిగే హక్కు లేదు ధన్వాడ ప్రజలు బీజేపీ,కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లు వేయరని బీఆర్ఎస్ యువనాయకులు ఇర్ఫాన్ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు అలుగు మీది వెంకటేష్, వసీం, ఆరిఫ్, బాలకృష్ణ ధన్వాడ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి,బిఆర్ఎస్‌కు పుట్టగతులు ఉండవు

◆ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్

మహబూబ్‌నగర్, జూలై25, ప్రభాతవార్త: వెనకబడిన కులాల వారిని స్థానికంగా రాజకీయ చైతన్యం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వస్తున్న బీసీ రిజర్వేషన్లను ఈ రాష్ట్రంలో అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి,బిఆర్ఎస్ కు పుట్టగతులు ఉండవని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగ్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వెనకబడిన కులాల కోసం చేపడుతున్న కార్యక్రమాలు దేశంలోని చర్చ జరుగుతుందన్నారు. కుల గణనను సమగ్రంగా సర్వే చేసి అధ్యయనం చేసిన తర్వాత బీసీ కులాలకు 42 స్థానిక సంస్థలు ,ఉపాధి, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు తీసుకువచ్చేందుకు పార్టీ తరపున అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పాలించిన టిఆర్ఎస్ పార్టీ బీసీల అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు అన్నారు. వారికి బీసీ రిజర్వేషన్ల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. 1970 నుంచి ముస్లిం రిజర్వేషన్లు ఉన్నాయని రాజశేఖరరెడ్డి పాలనలో బీసీ కమిషన్ ద్వారా సమగ్ర సర్వే చేశామని ముస్లింలలో ఎస్సీ కులాల కన్నా వెనుకబడిన వారు ఉన్నారని తేలిందన్నారు. విలేకరుల సమావేశంలో మీడియా సెల్ కన్వీనర్ సిజే బెనహర్, పార్టీ సీనియర్ నాయకులు సత్తూరు చంద్రశేఖర్ గౌడ్ ,రాముడి యాదవ్, బాలస్వామి, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు ఆవేద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జహీర్ అక్తర్

నిఘా నేత్రాలుగా సీసీ కెమెరాలు

◆ దొంగతనాలను అరికట్టాలంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి ◆ నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 25 ప్రభాతవార్త: నిఘా నేత్రాలుగా సీసీ కెమెరాలు పనిచేస్తాయని, ప్రతి ఒక్కరు తమ తమ వ్యాపార సముదాయాలు నిర్వహించుకునే షాపుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఎస్పీ కార్యాలయంలో గోల్డ్ షాప్ యజమానులు బ్యాంక్ మేనేజర్లు మరియు ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్షా సమావవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోజురోజుకు దొంగతనాలు పెరిగిపోతున్నాయని, కావున మీ యొక్క షాప్స్‌కి మరియు మీ ఫైనాన్స్ కార్యాలయాలకు మరియు మీ యొక్క బ్యాంకులకు 360 డిగ్రీస్ లో కవర్ అయ్యే విధంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు రెండు విధాలుగా రికార్డు అయ్యే విధంగా ఎన్విఆర్‌తో పాటు క్లౌడ్‌లో కూడా రికార్డు అయ్యే విధంగా చూసుకోవాలని, మీరు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు అలారం వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముందస్తుగా మనము జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి దొంగతనాలనైనా మనము ఆపగలిగే శక్తి ఉంటుందని, అందరికీ దిశా నిర్దేశాలు చేయడం జరిగిందని, అలాగే మీ కార్యాలయాల్లో పనిచేసే వారి మీద కూడా నిఘా ఉంచాలని వారి యొక్క జీవన స్థితిగతులు, మంచి, చెడు అలవాట్లు తెలిసి ఉండాలని వాళ్ళని కూడా తరచుగా గమనిస్తూ ఉండాలని తెలిపారు. మీరు మీ యొక్క షాపులలో మరియు బ్యాంకులలో కెమెరాలు ఏర్పాటు చేసేటప్పుడు ముందు భాగంలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా కవర్ అయ్యే విధంగా రెండు కెమెరాలు ఏర్పాటు చేసి వివిధ దొంగతనాలలో సహాయపడే విధంగా పోలీసు వారికిసహకరించాలని దిశానిర్దేశాలు చేశారు. ఒక డిఎస్పి మరియు ముగ్గురు ఎస్ఐల తోటి రోజు రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని,ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటామని తెలిపారు. జిల్లాలో దొంగతనాలకు నియంత్రణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలి : ఎమ్మెల్సీ

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై25 ప్రభాతవార్త: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మునిసిపాలిటీ పరిధిలోని జిల్లా కేంద్రంలోని 10 మరియు 24 వార్డులలో వర్షపునీరు ఇండ్లలోకి చేరుకొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి దృష్టికి మాజీ కౌన్సిలర్లు బాదం సునీత నరేందర్ తోపాటు 24వ వార్డు కౌన్సిలర్ నిజాముద్దీన్ తీసుకురావడంతో శుక్రవారం ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డితో పాటు సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పరిస్థితి ఇలా నెలకొని ఉంటే ఎలా అని వెంటనే మున్సిపల్ అధికారులు సిబ్బంది ప్రజలకు సమస్యలుతలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మురుగునీరు కాలనీలలోకి ప్రవేశించకుండా ఎప్పటికప్పుడు అండర్ డ్రైనేజీ సిస్టం అధికారులు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని మరో మారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కావద్దని మున్సిపల్ అధికారులకు సూచించారు. కాలనీలలో ప్రజలు ఇటీవల కురిసిన వర్షాలకు తాము ఎదుర్కొన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడం జరుగుతుందని, వాటిని యుద్ధ ప్రాతిపదికన ఖర్చు చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పలు వార్డుల మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహార చెక్కులు అందజేత

◆ సీఎంతో మాట్లాడి పరిహారం పెంచేందుకు ప్రయత్నం చేస్తా : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇంఛార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి

◆ భూములు, ఆస్తులు కోల్పోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం కల్పిస్తాం: ఆర్డీఓ రామచంద్రనాయక్

నష్టపరిహారం చెక్కులు అందజేస్తున్న దృశ్యం

నారాయణపేట ప్రతినిధి, జూలై 25 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోని రైతులకు సాగు నీరందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జీ కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోయిన 36 మంది రైతులకు నష్టపరిహారం చెక్కులను స్థానిక ఆర్డీఓ రామచంద్రనాయక్ కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు దేశంలో ఎక్కడా ఇంత తక్కువ సమయంలో నష్టపరిహారం అందించలేదని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు ఇస్తున్న పరిహారాన్ని ఇంకా కొంత పెంచి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్న విస్తానని, సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం పెంచేందుకు ప్రయత్నం చేస్తానని ఆయన చెప్పారు. ఆర్డీఓ రామచంద్రనాయక్ మాట్లాడుతూ నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు, ఇతర ఆస్తులు కోల్పోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందిస్తామని ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. భూములు అందించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా శుక్రవారం భూములు కోల్పోయిన దామరగిద్ద మండలం బాపన్ పల్లి గ్రామానికి చెందిన 21మంది రైతులకు రూ.59.99 లక్షల నష్టపరిహారం చెక్కులను, అలాగే నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతులకు రూ.52.15 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్డీఓ కార్యాలయ ఏ.వో అనిల్ కుమార్, తహసిల్దార్లు తిరుపతయ్య, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్,డీటీ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం

◆ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తెలంగాణ చందా పండిత్

◆ కలెక్టరేట్‌లో పెన్షన్, జి.పి.ఫ్ అదాలత్

ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న చందా పండిత్, కలెక్టర్ విజయేంద్ర బోయి

మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై25, ప్రభాతార్త: వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెండింగ్ లో ఉన్న పెన్షన్, జిపిఎఫ్ ఫైనల్ విత్ డ్రాయల్ కేసుల సత్వర పరిష్కారానికి పెన్షన్ ఆదాలత్ నిర్వహించి పరిష్కరించడం జరుగుతుందని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తెలంగాణ చందా పండిత్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ), కలెక్టరేట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెన్షన్, జి .పి.ఫ్ అదాలత్‌లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవి విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్లు,జిపిఎఫ్ అందచేతలో ఏమైనా సందేశాలు ఉంటే అదాలాత్ లలోనివృత్తి చేసుకోవాలని సూచించారు. పదవి విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ పత్రాలు,సాధారణ భవిష్య నిధి పత్రాలు అందిన వెంటనే అట్టి పత్రాలను పరిశీలించిన పిదప మంజూరు ఉత్తర్వులు అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. పెన్షన్,జి.పి.ఎఫ్ అదాలత్ లు ఉమ్మడి మహబూబ్ నగర్ కు జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయం లో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిమాట్లాడుతూ పింఛన్ ప్రభుత్వఉద్యోగుల హక్కు,పదవి విరమణ చేసిన రోజున ఉద్యోగులకు పెన్షన్ ఉత్తర్వులు అందేలా చూడాలని అన్నారు. ఉద్యోగ బాధ్యత లతో పాటు ఆర్థిక నిర్వహణ కూడా ముఖ్యమని కలెక్టర్ అన్నారు. అదేవిధంగా పెన్షన్ అదాలత్ ఏర్పాటు చేసి పెన్షన్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. 116 ప్రభుత్వ శాఖల నుండి అధికారులు,50 మంది పెన్షనర్ లు,28 మంది చందాదారులు,పెన్షనర్ ఆసోసి యేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తో కలిసి 20 మందికి పెన్షన్ మంజూరు పత్రాలు,16 జిపిఎఫ్ ఆథ రైజేషన్ ప్రొసీడింగ్స్‌లను పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందజేశారు.10 పెండింగ్ పెన్షన్ కేసులను పరిష్కరించారు. పెన్షన్,జి.పి.ఫ్,అకౌంట్ సంబంధిత సమస్యలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఉదయం పెన్షన్ అదాలత్ తర్వాత మధ్యాహ్నం పెన్షన్, జి.పి.ఎఫ్,అకౌంట్ సంబంధితసమస్యలపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పెన్షన్ మంజూరు అధికారులు,పెన్షన్ జారీ,పంపిణీ అధికారులకు మార్గదర్శకాలు వివరించి అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ జులిది)నరేష్ కుమార్,డిప్యూటీ అకౌంటెంట్ జనరల్(ఎన్ టైటిల్ మెంట్స్) అభయ్ అనిల్ సోనార్కర్, వనపర్తి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య,గద్వాల అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ నర్సింగరావు,ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి?

◆ హాస్పిటల్ ఎదుట ధర్నా చేసిన గ్రామస్తులు

హాస్పిటల్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పెబ్బేరు, జూలై25 ప్రభాతవార్త: వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో ఆసుపత్రిలో వైద్యం వికటించి పెంచికలపాడు గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం పెబ్బేరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన రాజు (35) మెడపై కణతి కావడంతో చికిత్స కోసం ఈ నెల 19వ తేదీన పెబ్బేరు పట్టణంలోని రాఘవేంద్ర హాస్పిటల్‌కు వచ్చి చూయించుకున్నాడు. డాక్టర్ కణతిని తొలగించి మెడిసిన్స్ రాసిచ్చాడు. రోజూ హాస్పిటలుకు వచ్చి డ్రెస్సింగ్ చేయించుకోవాలని చెప్పగా మృతుడు రాజు రోజూ హాస్పిటల్‌కు వచ్చి డ్రెస్సింగ్ చేయించుకొని వెళ్తున్నాడు. 24వ తేదీన గురువారం సాయంత్రం రాజు తన వ్యవసాయ పొలం దగ్గర ఫిట్స్ వచ్చి కిందపడడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు పెబ్బేరు పీహెచ్ సికి తీసుకురాగా వారు వనపర్తి జనరల్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. అక్కడి డాక్టర్లు సీటీ స్కాన్ చేయమని చెప్పడంతో వారు స్కాన్ తీయించారు. అందులో బ్లడ్ క్లాట్ అయ్యి చనిపోయాడని తేల్చిచెప్పారు. పెబ్బేరులోని ప్రైవేటు వైద్యుడు చేసిన నిర్లక్ష్య వైద్యం వల్లే తమ కుటుంబ సభ్యుడు చనిపోయాడని బాధితులు, గ్రామస్తులు శుక్రవారం రాఘవేంద్ర హాస్పిటల్ ముందు ఆందోళన చేస్తున్నారు. బాధితుడి మృత దేహంతో తమకు న్యాయం జరిగే వరకు, డాక్లర్‌పై అధికారులు చర్యలు తీసుకునే వరకు ధర్నా చేస్తా మంటూ వారు హెచ్చరించారు. హాస్పిటల్ యజమాని రాఘవేందర్ రెడ్డిని వార్త ప్రతినిధి స్వయంగా అడగగా 19వ తారీకు బాధితుడు రాజు ఒక్కడే వచ్చి తన వేడి గడ్డను తొలగించాలని తెలియజేయడంతో ఆ గడ్డలో ఉన్న చీమును మాత్రమే తొలగించానని దానికి డ్రెస్సింగ్ చేసి మెడిసిన్ ఇవ్వడం జరిగిందని. నేను చేసిన ట్రీట్మెంట్ కు బాధితుడు రాజు చనిపోవడానికి సంబంధం లేదని అతనికి మెదడులో బ్లడ్ జామ్ కావడం వల్లనే ఫిట్స్ వచ్చి ప్రమాదం జరిగి చనిపోవడానికి ప్రధాన కారణమని నేను చేసిన ట్రీట్మెంట్ కు సంబంధం లేదని డా. రాఘవేందర్ రెడ్డి స్వయంగా తెలియజేశారు.

గ్రామీణ విద్యలో కొత్త శకం

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రాధాన్యత ఇచ్చి,ప్రాథమిక పాటశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు కంప్యూటర్ శిక్షణ అందించి విద్యార్థులకు ప్రతిరోజూ ఎ.ఐ. విద్యా బోధన జరిగే విధంగా క్రమం తప్పకుండ పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా విద్యాధికారి, మండల విద్యా అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 23ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేయడమే కాకుండా ఇంటర్నెట్, విద్యార్థులకు హెడ్ సెట్ ఇతర మౌలిక సదుపాయాల్ని అందజేసి ప్రోత్సహిస్తున్నారు. తల్లిదండ్రుల స్పందన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రగతిని గమనించిన తల్లిదండ్రులు ఈ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా చదవడంలో వెనుకబడిన తమ పిల్లలు ఇప్పుడు పాఠశాలలో ఆసక్తితో పాల్గొంటున్నారని చెబుతున్నారు. కంప్యూటర్ విద్య నేర్పిస్తుండటంతో గ్రామంలో ఇప్పటిదాక తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్న వారు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మహిళాభ్యుదయానికి పెద్దపీట : ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి భాగం..

చేపట్టిన వెంటనే మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు. 200 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవడం జరిగిందని, ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సంస్థకు 6680 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. వంటింటికే పరిమితమైన మహిళలు ఈ పథకం ద్వారాఇతర ప్రాంతాలకు వెళ్లిచిరు వ్యాపారం చేసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు పెట్రోల్ పంపులు నిర్వాణతో పాటు బస్సులను కొనుగోలు చేసేందుకు రుణాలను మహిళా సంఘాలకు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పథకంద్వారా ఆర్టీసీ బలోపేతం కావడంతో పాటు మహిళలు కూడా ఆర్థికంగా ప్రయోజకులుగా మారుతున్నారనిఆయన వివరించారు.